కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -137 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 28-05-2026 గురువారం పేజీలు : 4

# గర్జించిన మహానాడు

- మంగళగిరిలో టీడీపీ మహాసభల సందడి
- పసుపు పండుగలా మారిన మహానాడు
- చంద్రబాబు ఘాటు రాజకీయ వ్యాఖ్యలు
- ‘గొడ్డలి పార్టీని తిరస్కరించాలి’
- యువతకు ఉద్యోగాలే లక్ష్యం
- స్వర్ణాంధ్ర విజన్‌తో టీడీపీ దూకుడు
- ఐటీ నుంచి క్వాంటం దిశగా ఏపీ
- కార్యకర్తలకే పార్టీ తొలి ప్రాధాన్యం
- మహిళలకు 33% సీట్లు: లోకేశ్
- జగన్‌కు లోకేశ్ ఓపెన్ ఛాలెంజ్
- ‘మాది గూగుల్.. మీది గొడ్డలి’
- టీడీపీ ఇంట్లో యోధులే పుడతారు
- మహానాడులో రూ.11 కోట్ల విరాళాలు
- హైబ్రిడ్ మహానాడుపై లోకేశ్ కౌంటర్



**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** మంగళగిరిలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు–2026 అట్టహాసంగా ప్రారంభమైంది. హైబ్రిడ్ విధానంలో జరుగుతున్న ఈ మహాసభలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పసుపు జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీగా హాజరై మహానాడును పసుపు పండుగలా మార్చేశారు.

సభలో మాట్లాడిన చంద్రబాబు.. మహానాడు కేవలం పార్టీ సమావేశం కాదని, ప్రజలకు భరోసా ఇచ్చే ఉత్సవమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే “గొడ్డలి పార్టీ”ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. “పేదలకు కావాల్సింది సంక్షేమం.. యువతకు కావాల్సింది ఉద్యోగాలు.. రాష్ట్రానికి కావాల్సింది శాంతిభద్రతలు” అంటూ వైసీపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “రక్త చరిత్ర రాసేవారు స్వర్ణాంధ్ర చరిత్ర రాయలేరు” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

‘వైసీపీ, టీడీపీ బోత్ ఆర్ నాట్ సేమ్’

“వేట కొడవళ్ల నుంచి గొడ్డలి దాకా ఎదగడం వారి విధానం.. ఐటీ నుంచి క్వాంటం దిశగా ఎదగడం మన విధానం” అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సభలో హాట్ టాపిక్ అయ్యాయి. ప్రపంచంలో అత్యుత్తమ టెక్నాలజీని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొస్తామని ప్రకటించిన ఆయన.. 280 ప్రాజెక్టులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. పార్టీ ఫస్ట్ అనే సిద్ధాంతంతోనే టీడీపీ ముందుకెళ్తుందని, కార్యకర్తలను పట్టించుకోని నాయకులను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

మిగతాది 2 లో..


## గోదావరి పుష్కరాలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




## బాల్క సుమన్‌కు బిగ్ షాక్.. నాంపల్లి స్టేషన్‌లో కేసు నమోదు




## ఈసీకి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ సర్ పై సంచలన తీర్పు




**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** ఎన్నికల కమిషన్‌కు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) నిర్వహించే అధికారం ఉందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆర్టికల్ 324 ప్రకారం ఈసీకి పూర్తి అధికారులు ఉన్నాయి .ఎస్ఐఆర్ విషయంలో ఎన్నికల సంఘం అధికారాలను సుప్రీంకోర్టు సమర్థించింది. సర్ ప్రక్రియ చట్టాలకు గానీ, రాజ్యాంగ నిబంధనలకు గానీ విరుద్ధం కాదని స్పష్టం చేసింది. సర్ చేపట్టాలన్న భారత ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

### నదుల కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు



**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** వచ్చే ఏడాది జూన్ నెలలో మొదలయ్యే గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరితోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదులలో కాలుష్య నివారణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నదుల్లోని కాలుష్య సమస్యలను గుర్తించి, వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టడం కోసం అత్యున్నత స్థాయి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి శ్రీ పవన్ కల్యాణ్ అధ్యక్షతన రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

రాజమహేంద్రవరంలో రెండు రోజులపాటు పర్యటించిన పవన్ కల్యాణ్ స్వయంగా పడవపై ప్రయాణించి నల్లా ఛానల్, ఆంధ్ర పేపర్ మిల్స్ పరిశ్రమల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలు, నగర మురుగునీరు నేరుగా గోదావరి నదిలో కలవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్ జగన్ ఫోకస్

### వైసీపీ ఇంఛార్జిలకు స్ట్రాంగ్ వార్నింగ్




## జూన్ 2న పే స్కేల్ ప్రకటించండి

### మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఉపాధి హామీ సిబ్బంది




**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ సిబ్బంది తమ చిరకాల డిమాండ్ అయిన పే స్కేల్‌ను రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రకటించాలని సాంకేతిక సహాయకుల సంఘం నేతలు మంత్రి సీతక్కను కలిశారు.ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రతినిధులు తమ సమస్యలు, ఆకాంక్షలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 2న పే స్కేల్ ప్రకటించి వేలాది మంది ఉద్యోగుల జీవితాల్లో కొత్త ఆశలు నింపాలని విజ్ఞప్తి చేశారు.

# నేడే సిద్ధరామయ్య రాజీనామా!

## ఏకైక ఓబీసీ సీఎంను పక్కన పెట్టబోతున్న కాంగ్రెస్.. తెరపైకి కేరళ మోడల్?

**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** కర్ణాటక రాజకీయం రసతవత్తరంగా మారింది. సీఎం మార్పుపై ఎలాంటి చర్చ జరగలేదని అధిష్టానం పెద్దలు చెబుతున్నప్పటికీ నేడు సిద్ధరామయ్య తన సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ మేరకు సిద్ధరామయ్య గవర్నర్ అపాయింట్ మెంట్ సైతం కోరారని ఆయన రాజీనామా అనంతరం కొత్త సీఎంగా డీకే శివకుమార్ ఈ నెల 30వ తేదీన ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలను బట్టి సిద్ధరామయ్య స్థానంలో ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్‌కు రాష్ట్ర పగ్గాలు అప్పగించేందుకు కాంగ్రెస్ పెద్దలు సిద్ధమయ్యారని అంతా భావిస్తుండగా రాహుల్ గాంధీ వేసిన సరికొత్త వ్యూహం అందరిని ఆశ్చర్యపరిచేలా చేస్తోంది. సీఎం మార్పుతో పాటే మంత్రివర్గాన్ని ప్రక్షాళన చేయాలని ఇందుకోసం కేరళ మోడల్ అనుసరించాలని రాహుల్ గాంధీ ప్రతిపాదించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.



BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# గర్జించిన మహానాడు
## మంగళగిరిలో టీడీపీ మహాసభల సందడి

మొదటి పేజీ తరువాయి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ మహానాడు పార్టీ భావజాలానికి ప్రతిబింబమని అన్నారు. అధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చామని, భవిష్యత్తులోనూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు అవకాశాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. "స్వర్ణాంధ్ర విజన్-2047"తో చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నారని, పార్టీలో 63 శాతం యువతకు ప్రాధాన్యత దక్కుతోందని తెలిపారు.

మహిళలకు 33% రిజర్వేషన్.. లోకేశ్ బిగ్ అనౌన్స్‌మెంట్

మహానాడు వేదికగా మాట్లాడిన నారా లోకేశ్ సంచలన ప్రకటన చేశారు. "పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ అయినా కాకపోయినా 2029 ఎన్నికల్లో టీడీపీ తరపున మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం" అని ప్రకటించారు. మహిళా సాధికారతకు ఎన్టీఆర్ పునాది వేసారని, అదే దారిలో పార్టీ ముందుకెళ్తుందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ కాలంలో టీడీపీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తనపై కూడా 23 కేసులు పెట్టారని లోకేశ్ ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు తాను సిద్ధమని, తేదీ-సమయం వైఎస్ జగన్ నిర్ణయించాలని సవాల్ విసిరారు. "మాది గూగుల్.. మీద గొడ్డలి. మాది ఫైటర్ జెట్.. మీది ఫ్యాక్షన్" అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో చప్పట్ల వర్షం కురిపించాయి.

'టీడీపీ కార్యకర్తల ఇంట్లో యోధులే పుడతారు'

టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరీ మాట్లాడుతూ మహానాడును "పసుపు సైన్యం గర్జన"గా అభివర్ణించారు. "ప్రతి ఇంట్లో పిల్లలు పుడతారు.. కానీ టీడీపీ కార్యకర్తల ఇంట్లో యోధులు పుడతారు" అంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు. అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ లక్ష్యమైతే.. హత్యలు, అవినీతి, దోపిడీ వైసీపీ గుర్తింపుగా మారాయని విమర్శించారు. గత వైసీపీ పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు.

మహానాడులో విరాళాల వెల్లువ

మహానాడు మొదటి రోజే టీడీపీకి భారీగా విరాళాలు వచ్చిపడ్డాయి. వివిధ నేతలు, పారిశ్రామికవేత్తలు కలిపి ఏకంగా రూ.11 కోట్ల విరాళాలను ప్రకటించారు. ప్రముఖ నేతలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.5 కోట్లు విరాళంగా ప్రకటించగా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రూ.1.50 కోట్లు అందజేశారు. సానా సతీష్ రూ.1.50 కోట్లు, భాష్యం రామకృష్ణ రూ.1 కోటి విరాళం ఇచ్చారు. పార్టీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ కూడా విరాళం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న రెండో మహానాడు కావడంతో నేతలు పోటీ పడి మరీ పార్టీకి అండగా నిలుస్తున్నారు.

'హైబ్రిడ్ అయినా.. బ్యాటింగ్ తప్పదు'

హైబ్రిడ్ మోడల్‌పై విమర్శలు చేసిన వారికి కూడా లోకేశ్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. "మహానాడు ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ అయినా టీమ్-11కి బ్యాటింగ్ తప్పదు" అంటూ వైసీపీపై విమర్శలు గుప్పించారు. వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ "బాబాయిని గొడ్డలితో చంపింది నిజం కాదా?" అని ప్రశ్నించారు.

మొత్తంగా మహానాడు-2026 వేదికగా టీడీపీ శ్రేణులు ఐక్యతను ప్రదర్శించడమే కాకుండా.. మహిళా రిజర్వేషన్లు, అభివృద్ధి, సంక్షేమం, స్వర్ణాంధ్ర లక్ష్యాలతో వచ్చే ఎన్నికలకు పార్టీ దిశానిర్దేశం చేసినట్టుగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఈసీకి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్.. సర్ పై సంచలన తీర్పు

మొదటి పేజీ తరువాయి



సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం, ఈ ఏడాది ప్రారంభంలో విస్తృత విచారణల అనంతరం ఈ విషయంలో తీర్పును రిజర్వ్ చేయగా బుధవారం తీర్పును వెలువరించింది. ఖచ్చితమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు సర్ ఒక కీలక అడుగు అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ప్రక్రియ రాజ్యాంగానికి కొత్త ఊపిరి పోసే చర్యగా అభివర్ణిస్తూ ఎన్నికల వ్యవస్థ పారదర్శకతను, విశ్వసనీయతను బలోపేతం చేస్తుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ గ్రీన్ సిగ్నల్ పడినట్లైంది.

## గోదావరి పుష్కరాలపై.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** రాష్ట్రంలో వచ్చే ఏడాదిలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. దీంతో ఇప్పటినుంచే ప్రభుత్వం దృష్టి సారించింది. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా కాలుష్య నియంత్రణను సీరియస్‌గా తీసుకుంది. క్లీన్ అండ్ గ్రీన్ నెస్ లో నిర్వహించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గోదావరి ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాన్ని ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తోంది. సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తోంది. గోదావరి పుష్కరాలపై దిశానిర్దేశం చేస్తోంది.

గోదావరి పుష్కరాలు-2027పై కీలక నిర్ణయం

అయితే తాజాగా గోదావరి పుష్కరాలు-2027 పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి సహా ప్రధాన నదుల కాలుష్య నియంత్రణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతోపర్యావరణ, ఆటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అలాగే నదుల కాలుష్య నివారణపై కార్యచరణ సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు సమాచారం. వివిధ శాఖల హెచ్‌వోడీలకు నోడల్ అధికారులుగా బాధ్యతలుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. దీంతో నదులు కాలుష్య నియంత్రణపై ఈ అధికారులు ఇప్పటి నుంచే రంగంలోకి దిగనున్నారు.

# బాల్క సుమన్‌కు బిగ్ షాక్..
## నాంపల్లి స్టేషన్‌లో కేసు నమోదు



**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బాల్క సుమన్ కు బిగ్ షాక్ తగిలింది. తెలంగాణలో మిలిటెంట్ ఉద్యమం రావాలని, బీఆర్ఎస్ కార్యకర్తలు మిలిటెంట్లలా పనిచేయాలని చేసిన వ్యాఖ్యలపై నాంపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైనట్లు తెలుస్తుంది. మంగళవారం జరిగిన ఓ ప్రెస్ మీట్ లో బాల్క సుమన్ మాట్లాడుతూ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దీనిపై హైదరాబాద్ కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తుంది. కాగా ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇదిలా ఉంటే మంగళవారం బాల్క సుమన్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు సైతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అందులో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు ఎవరూ నిరసనల్లో పాల్గొనడం లేదని, కార్యకర్తలే మన కార్యకర్తలే మిలిటెంట్ దాడులు చెయ్యాలి. భారత ప్రభుత్వ ఆస్తులు తగలబెట్టాలి. ఆఫీసులు కాలబెట్టాలి అంగడి అంగడి చేసి నాశనం చేయాలి. మిలిటెంట్ లెక్క దాడులు చేయాలి. రైలు పట్టాలు కోసి పడేయాలి. సింగరేణి ఆఫీసులను తగలబెట్టండంటూ చేసిన వ్యాఖ్యలు వీడియో వైరల్ గా మారింది. దీనిపై స్పందిస్తున్న నెటిజన్లు బీఆర్ఎస్, బల్క సుమన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్ జగన్ ఫోకస్..
## వైసీపీ ఇంఛార్జిలకు స్ట్రాంగ్ వార్నింగ్

**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** స్థానిక సంస్థల ఎన్నికలకు ఏపీలో రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతూ ఉండటంతో.. విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు కుట్రలను ఎదుర్కొని.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ నేతలకు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎలా నడుచుకోవాలనే దానిపై నేతలకు జగన్ పలు సూచనలు చేశారు.

ఈ క్రమంలోనే పరోక్షంగా వార్నింగ్ కూడా ఇచ్చారు వైసీపీ అధినేత. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా పోటీ చేయాలని.. పోటీ చేసే అభ్యర్థికి ఇంఛార్జిలు సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం జరిగితే అది.. ఆ నియోజకవర్గ ఇంఛార్జి వైఫల్యంగా భావిస్తానంటూ జగన్ హెచ్చరించారు.

"ఎన్ని కుట్రలు చేసినా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఇది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోండి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెప్తున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా. ఇది మీరు గుర్తుపెట్టుకోండి. ఎస్సీలు మనకు అండగా నిలిచే గ్రామాలు ఉన్నాయి. అలాంటి చోట్ల ఆ గ్రామంలోని ఎస్సీల నుంచి క్యాండిడేట్ రావాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి. వారికి మీరు సహకారం అందించాలి. నాకు వైసీపీ తోడుగా ఉంది, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యం కల్పిస్తే.. అసెంబ్లీ ఎన్నికల్లో వారు మీకు తోడుగా నిలుస్తారు." అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

మరోవైపు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు ఎవరనే దానిపై ఇప్పటికే ఇంఛార్జులకు స్పష్టమైన అవగాహన ఉంటుందన్న జగన్.. స్థానిక సంస్థల ఎన్నికల కోసం వారిలో నుంచి ఎంపిక చేసి పోటీకి సన్నద్ధం చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికలు వచ్చేనాటికి.. చంద్రబాబు ప్రభుత్వం పాలనా వైఫల్యాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను.. వైసీపీ గ్రామ, వార్డు స్థాయి యంత్రాంగం ద్వారా, ప్రతి ఇంటికీ చేరవేయాలని.. వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వెన్నుపోటు రెండేళ్లు పేరుతో చంద్రబాబు వైఫల్యాలపై రూపొందించిన ఈ బుక్‌లెట్ కాపీలు ప్రతీ ఇంటికీ చేరేలా చూడాలని నేతలకు జగన్ స్పష్టం చేశారపు. చంద్రబాబు వైఫల్యాలపై చర్చ జరిగేలా చేస్తే.. ప్రజలే తిరగబడతారని వైఎస్ జగన్ సూచించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు
## నదుల కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి



పుష్కరాలకు వచ్చే భక్తులు తాము మురుగు నీటిలో స్నానం చేస్తున్నామనే భావనతో వెళ్లకూడదు. ప్రతి ఒక్కరికీ పవిత్రమైన, స్వచ్ఛమైన గోదావరి జలాల్లో స్నానం చేస్తున్నామనే ఆధ్యాత్మిక అనుభూతి కలగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి నదిని కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్ ఫోర్స్ నదిలోకి కలిసే మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టడంతోపాటు, శాశ్వత పర్యావరణ రక్షణ చర్యలను పర్యవేక్షించనుంది.

కమిటీ స్వరూపం

ఈ ప్రత్యేక కమిటీకి పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. పురపాలక పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ), పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్, పరిశ్రమల శాఖ కమిషనర్, వ్యవసాయ శాఖ కమిషనర్, మత్స్య శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సీఈవో, దేవాదాయ శాఖ కమిషనర్, జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్-ఇన్-చీఫ్, క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్స్ మిషన్ డైరెక్టర్, గోదావరి పరివాహక ప్రాంత జిల్లాలైన తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు.

కమిటీ ప్రధాన విధులు

ఈ ప్రత్యేక కమిటీ ప్రతి15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా సమావేశం అవుతుంది. గోదావరితోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదుల్లోకి కాలుష్యం ఎక్కడెక్కడ నుంచి చేరుతుందో క్షేత్రస్థాయిలో గుర్తిస్తుంది. అంతేకాదు.. గుర్తించిన సమస్యలకు కాలుష్య నియంత్రణ మండలి సూచనల ప్రకారం నివారణ చర్యలను తీసుకుంటూ పనుల ప్రగతిని పర్యవేక్షిస్తుంది. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు స్వచ్ఛమైన నదీ జలాలను అందించడమే లక్ష్యంగా ఈ టాస్క్ ఫోర్స్ పనిచేస్తుంది.

# లోకంలో లేనివారిపై టీడీపీ దుష్ప్రచారం,
## నీచ రాజకీయాలు : వైఎస్ షర్మిల



**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** లోకంలో లేని, సంజాయిషీ ఇచ్చుకోలేని వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాత రాజారెడ్డి పై టీడీపీ దుష్ప్రచారం చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వారు అంత దుర్మార్గులే అయితే తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు విచారణ జరపలేదు ? ఎందుకు శిక్షించలేదు ? మీకు చేతకాలేదా? అంటూ ట్విటర్ వేదిక ద్వారా ప్రశ్నించారు.

కూటమి అధికారంలోకొచ్చి రెండేళ్లు అవుతుంది. చెప్పుకోదగ్గ విజయాలు లేకనే, పాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు దివంగతులను లాగి టీడీపీ నీచ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. పగబట్టి తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన ఉత్తములు అయిపోరని, ఆకాశం మీద ఉమ్మేస్తే అది తిరిగి ఎక్కడ పడుతుందో రెండేళ్లుగా అధ్వాన్న పాలన చేసే అపర మేధావులు తెలుసుకోవాలని హితవు పలికారు.

వైఎస్ రాజారెడ్డి సీమలో జరిగిన అరాచకాలు ఎదురించి పేదల పక్షాన నిలబడ్డ వ్యక్తని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే పదాలకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిరునామా అని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, రుణమాఫీ, ఉచిత కరెంటు లాంటి పథకాలు వైఎస్సార్‌కే సాధ్యమయ్యాయని తెలిపారు. పోలవరాన్ని మొదలు పెట్టి 33 శాతం పనులు 5 ఏళ్లలో పూర్తి చేస్తే, తర్వాత రెండు సార్లు సీఎంగా ఉన్న చంద్రబాబుకి మిగతా పనుల పూర్తికి చేతకాలేదదని విమర్శించారు.

# దేశంలో ముదురుతున్న ఎండలు
## నేపథ్యంలో ప్రధాని మోడీ కీలక పిలుపు



**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** భారతదేశవ్యాప్తంగా గత కొద్ది రోజులుగా ఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. అయితే వాతావరణ శాఖ అంచనా మేరకు రాబోయే వారం రోజుల పాటు ఎండలు మరింత పెరగనున్నాయి. ప్రస్తుతం దంచికొడుతున్న ఎండ తీవ్రత (హీట్‌వేవ్), దాని వల్ల ఎదురవుతున్న సవాళ్లను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా దేశ ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. ఈ కఠినమైన వాతావరణంలో ప్రతి ఒక్కరూ సాధ్యమైనన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ఎల్లప్పుడూ శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలని సూచించారు. వీటితో పాటు, ఇలాంటి క్లిష్టమైన వాతావరణంలో మన చుట్టుపక్కల ఉండే ఇతరులకు, శ్రామికులకు, దారినపోయే వారికి కనీసం ఒక గ్లాసు మంచి నీళ్లు ఇచ్చి సహాయం చేయాలని, ఈ చిన్న మానవత్వపు సహాయం ఎంతో మేలు చేస్తుందని ప్రధాని మోడీ ఈ సందర్భంగా దేశ ప్రజలకు గుర్తుచేశారు.

## నేడే సిద్ధరామయ్య రాజీనామా!..ఏకైక ఓబీసీ సీఎంను పక్కన పెట్టబోతున్న కాంగ్రెస్.. తెరపైకి కేరళ మోడల్?

మొదటి పేజీ తరువాయి

ఏకైక ఓబీసీ సీఎంకు పదవి దూరం:

రాహుల్ గాంధీ గత ఎన్నికల నుంచి సామాజిక న్యాయం నినాదంతో ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీఎంగా ఉన్న ఏకైక ఓబీసీ ముఖ్యమంత్రిని సిద్ధరామయ్యను ఆ పదవి నుంచి తప్పించాల్సి రావడం రాహుల్ గాంధీ నినాదానికి ఇదో కీలక పరిణామంగా మారనుంది. ఈ నేపథ్యంలో పార్టీకి డ్యామేజ్ జరగకుండా చూసేందుకు రాహుల్ గాంధీ తన 'సామాజిక న్యాయం' నినాదాన్ని కొత్త కేబినెట్‌లో బలంగా అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో 25 మంది మంత్రులను పక్కన పెట్టి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. నూతన కేబినెట్ కూర్పులో దళితులు, ఓబీసీలు, మైనారిటీలకు పెద్ద పీట వేయాలని తద్వారా సిద్ధరామయ్యకు బలమైన మద్దతుగా ఉన్న 'అహిందా' (దళితులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీల కూటమి) ఓటు బ్యాంకు చేజారిపోకుండా చూసుకోవాలనేది హైకమాండ్ ప్లాన్ గా తెలుస్తోంది.

కర్ణాటకలో కేరళ మోడల్!:

రాబోయే 2028 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యువ ఓటర్లను ఆకర్షించేందుకు కేబినెట్‌లో యువ ముఖాలకు ఎక్కువ అవకాశం ఇవ్వాలని రాహుల్ గాంధీ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం 'కేరళ మోడల్'ను అనుసరించాలని నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కేరళలో కొత్తగా కొలువుదీరిన యూడీఎఫ్ ప్రభుత్వంలోయూత్ కాంగ్రెస్ నేపథ్యం ఉన్న యువ నాయకులకు మంత్రి పదవులు ఇచ్చినట్లుగానే కర్ణాటకలోనూ యువ నేతలకు అవకాశం కల్పించి కేబినెట్ స్థానం కోల్పోబోతున్న మంత్రులకు పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనతో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.

ఇద్దరు డిప్యూటీ సీఎంలు:


ప్రస్తుతం కర్ణాటకలో సీఎంగా సిద్ధరామయ్య కొనసాగుతుండగా డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ వ్యవహరిస్తున్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడితే ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలనే ప్రతిపాదన సిద్ధ రామయ్య వర్గం నుంచి బలంగా వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఒకటి దళిత నేతకు ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కర్ణాటక చరిత్రలో దళిత ముఖ్యమంత్రి లేని నేపథ్యంలో ఒక డిప్యూటీ సీఎం పదవిని ఇవ్వడం ద్వారా ఆ సామాజిక వర్గానికి సానుకూల సందేశం పంపాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇద్దరు డిప్యూటీ సీఎంల ప్రతిపాదనను డీకే శివకుమార్ వర్గం మాత్రం అంగీకరించడం లేదని తెలుస్తోంది.

# జూన్ 2న పే స్కేల్ ప్రకటించండి
## మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఉపాధి హామీ సిబ్బంది




**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ సిబ్బంది తమ చిరకాల డిమాండ్ అయిన పే స్కేల్‌ను రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రకటించాలని సాంకేతిక సహాయకుల సంఘం నేతలు మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రతినిధులు తమ సమస్యలు, ఆకాంక్షలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 2న పే స్కేల్ ప్రకటించి వేలాది మంది ఉద్యోగుల జీవితాల్లో కొత్త ఆశలు నింపాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో సేవలందిస్తున్న సాంకేతిక సహాయకులు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం అమలులో ఉన్న ఉపాధి హామీ పథకం త్వరలో మారబోతున్న నేపథ్యంలో, మహాత్మా గాంధీ పేరు మీద కొనసాగుతున్న పథకంలోని ఉద్యోగులకు ఈ మార్పునకు ముందే పే స్కేల్ ప్రకటిస్తే అది చారిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుందని వివరించారు.

# అది చేసి చూపకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ కూడా చేయను..కేటీఆర్ కు మంత్రి పొంగులేటి కౌంటర్




**న్యూస్ డెస్క్, 27 మే (బిఎన్ఎస్):** 'హైదరాబాద్ నగరంలో రేవంత్ రెడ్డి ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటాను' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. జీహెచ్ఎంసీ ప్రాంతంలో మా ప్రభుత్వం బీఆర్ఎస్ కంటే ఎక్కువ ఇండ్లు కడితేనే వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేస్తానని, చెప్పినట్లు మేము ఎక్కువ ఇండ్లు కట్టి చూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకు కేటీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హౌసింగ్ శాఖనే పూర్తిగా డిస్మాండిల్ చేశారని, ఏనాడైనా పేదవారి ఆలోచనలను పరిగణలోకి తీసుకున్నారా అని నిలదీశారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కంటే ఎక్కువ సంఖ్యలో ఈ రెండున్నరేళ్లలో కట్టి చూపిస్తామన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పేదలు నివసించే ప్రాంతంలోనే ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇందుకోసం ఎంత ఖర్చైనా ప్రభుత్వం భరిస్తుందన్నారు.

# కొండాపూర్ ఆర్టీఏలో ఏసీబీ ఆకస్మిక సోదాలు

- ఇద్దరు డీఎస్పీలు, నలుగురు ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు
- పెండింగ్ ఫైళ్లు, రిజిస్ట్రేషన్ల తీరుపై క్షుణ్ణ పరిశీలన
- ఏజెంట్ల అక్రమాలపై అందిన ఫిర్యాదులతో చర్యలు




సైబరాబాద్: (బిఎన్ఎస్): కొండాపూర్ ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్టీఏ)లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీలు మాజిద్ అలీ ఖాన్, చలపతిరావు నేతృత్వంలో నలుగురు ఇన్‌స్పెక్టర్ల బృందం ఉదయం నుంచి కార్యాలయంలో సోదాలు నిర్వహించింది.

**ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు...**

ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరుగుతున్నాయని ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. నేరుగా వచ్చే దరఖాస్తుదారుల ఫైళ్లను కావాలనే పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**పెండింగ్ ఫైళ్ల పరిశీలన...**

పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కార్యాలయ మొత్తం పనితీరుపై అధికారులు సమగ్రంగా దృష్టి సారించారు. విధుల్లో ఉన్న సిబ్బందిని ప్రశ్నించడంతో పాటు, ఆయా విభాగాల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల ప్రకారం లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా లేదా అనే అంశాన్ని నిశితంగా పరిశీలించారు.

**ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూళ్లపై ఆరా...**

కార్యాలయ ఆవరణలో సంచరిస్తున్న ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను కూడా ఏసీబీ బృందం విచారించింది. వాహనదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేసి, ఎలాంటి పరీక్షలు లేకుండా లైసెన్సులు ఇప్పిస్తున్నారా అనే కోణంలో ఆరా తీశారు. ఈ ఆకస్మిక తనిఖీలతో ఆర్టీఏ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు

# అర్ధరాత్రి వర్షానికి హైదర్‌నగర్ లింక్ రోడ్డు అస్తవ్యస్తం



- డీసీ చాముండేశ్వరి తనిఖీ
- రోడ్డుపై నిలిచిన బురద నీరు, ఇసుక మేటల తొలగింపు
- తెల్లవారే సరికే రంగంలోకి దిగిన పారిశుధ్య సిబ్బంది

హైదర్‌నగర్:(బిఎన్ఎస్): మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి హైదర్‌నగర్ లింక్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి, రోడ్డుకు ఇరువైపులా ఇసుక మేటలు వేసింది. ఉదయం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న డీసీ చాముండేశ్వరి వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైదర్‌నగర్ డివిజన్-243, ఆల్విన్ కాలనీ సర్కిల్-51 పరిధిలోని లింక్ రోడ్డుపై పారిశుధ్య సిబ్బంది పారలు, గడ్డపారలతో నిలిచిన బురద నీటిని తోడుతూ, ఇసుకను తొలగించే పనులను డీసీ దగ్గరుండి పర్యవేక్షించారు. వర్షాకాలంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్లను శుభ్రంగా ఉంచాలని, రోడ్లపై పేరుకున్న మట్టి, ఇసుక, చెత్తను వెంటనే తొలగించాలని డీసీ సిబ్బందికి సూచించారు. రోడ్డు శుభ్రంగా ఉంటేనే ప్రమాదాలు నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఎస్‌డబ్ల్యూఎం వై. శంకర్ గణేష్, ఏఈఈ బస్సీ పాటిల్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఏ రాము, ఇతర పారిశుధ్య విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# హఫీజ్‌పేట్ డబుల్ బెడ్రూం కమిటీ సభ్యుల భేటీ



హఫీజ్‌పేట్, (బిఎన్ఎస్): హఫీజ్‌పేట్ డబుల్ బెడ్రూం కాలనీ నూతన కమిటీ సభ్యులు మే 27న బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేశ్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పారిశుధ్యం, తాగునీరు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి తనవంతు సహకారం అందిస్తానని మహేశ్ యాదవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారు వంశీ, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, జాయింట్ సెక్రటరీ బి.రాజు, ఖజాంచి ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవరాజ్‌తో పాటు శ్రీదేవి, ప్రమీల, లావణ్య, అనిల్, వెంకటేష్, కృష్ణ నాయక్, మహేశ్ పాల్గొన్నారు. కాలనీ సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.

# దొంగతనాలకు పాల్పడిన దొంగలు అరెస్ట్




కడపజిల్లా(బిఎన్ఎస్)మే27: ద్విచక్రవాహనాలు,బ్యాగులను దొంగతనం చేస్తున్న ఇరువురు దొంగలను అరెస్ట్ చేసిన మైదుకూరు పోలీసులు.వారి వద్ద నుండి పదహేయిదు లక్షలు విలువ చేసే బంగారు నగలు,అయిదు లక్షల విలువ చేసే ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మైదుకూరు డిఎస్పీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.ప్రొద్దుటూరు కు చెందిన సుభాన్ బీ శెట్టివారి పల్లెకు వివాహంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ లో బ్యాగ్ దొంగతనం జరిగిందని,మహిళమైదుకూరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసింది.ఈ మేరకు పోలీసులు తమదైన పద్ధతిలో విచారణ చేపట్టి సీసీ కెమెరా రికార్డు ఆధారాలతో కేసును

చెందించడం జరిగిందన్నారు.అదేవిదంగా ద్విచక్ర వాహన దొంగ నన్నే భాయ్ వాహన తనిఖీలో భాగంగా విచారణ చేయడంతో దొంగను గుర్తించండముజరిగిందన్నారు.ఇలా వేరువేరు కేసుల్లో ఈరోజుముద్దాయి లను అరెస్ట్ చేసి కోర్ట్ కు హాజరు పరచడం జరిగింది అన్నారు.కేసును చెడించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అర్బన్ సీఐ రమణా రెడ్డి ఎస్.ఐ లు చిరంజీవి,కత్తిరమణ పోలీసు లను డిఎస్పీఅభినందించారు.

# వారం రోజుల్లో 6 సైబర్ నేరాలు ఛేదన

- ట్రేడింగ్ ఫ్రాడ్‌లే ఎక్కువ
- 10 మంది అరెస్టు
- బాధితులకు రూ.1.39 కోట్లు రీఫండ్



సైబర్ క్రైమ్స్ డిసిపి టి.సాయి మనోహర్.

సైబరాబాద్,:(బిఎన్ఎస్): సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వారం రోజుల్లో దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ నేర ముఠాలపై ఉక్కుపాదం మోపారు. మే 20 నుంచి 26 వరకు 6 కేసులను ఛేదించి వివిధ రాష్ట్రాలకు చెందిన 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ టి. సాయి మనోహర్ బుధవారం వెల్లడించారు. అరెస్టయిన వారిలో నలుగురు ట్రేడింగ్ ఫ్రాడ్‌కు పాల్పడిన వారే కావడం విశేషం. నమోదైన కేసుల్లో రెండు ట్రేడింగ్ ఫ్రాడ్‌లు కాగా, ఇంపర్సనేషన్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, విషింగ్ కాల్ ఫ్రాడ్ ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. విషింగ్ కాల్ ఫ్రాడ్ కేసులో ముగ్గురు నిందితులు పట్టుబడగా, మిగిలిన కేసుల్లో ఒక్కొక్కరిని అరెస్టు చేశారు. ఈ వారంలో కీలకమైన కేసు నకిలీ 'ACEFD' ట్రేడింగ్ యాప్‌కు సంబంధించింది. '77 Accel Partners Stock Exchange Group' పేరుతో వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తూ బ్లాక్ ట్రేడింగ్, ఐపీఓ అలాట్‌మెంట్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ పేరుతో భారీ లాభాల ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి రూ.7,19,964 కాజేశారు. నకిలీ యాప్‌లో వర్చువల్ లాభాలు చూపించి నమ్మించిన నిందితులు, డబ్బును పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించారు. మొదట చిన్న మొత్తాలు విత్‌డ్రా చేసే అవకాశం ఇచ్చి నమ్మకం కలిగించారు. భారీగా సొమ్ము జమ అయ్యాక విత్‌డ్రాలను నిలిపివేసి, అదనపు కమీషన్ చెల్లిస్తేనే డబ్బు ఇస్తామని బెదిరించారు. మోసం గ్రహించేలోపు వాట్సాప్ గ్రూప్‌ను మ్యూట్ చేసి పరారయ్యారు. ఈ కేసులో సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి, మోసపూరిత సొమ్మును మళ్లించేందుకు కమీషన్ తీసుకున్న ఢిల్లీకి చెందిన అసిమ్ ఖాన్, షాజెబ్ ఖాన్, మొహమ్మద్ క్రమాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అదే సమయంలో బాధితులకు ఊరట కలిగేలా 70 కేసుల్లో 440 రీఫండ్ ఆర్డర్లు సాధించి రూ.1,39,39,325 తిరిగి ఇప్పించినట్లు డీసీపీ తెలిపారు. సోషల్ మీడియా, వాట్సాప్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపుల్లో అధిక లాభాల హామీలను నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. ట్రేడింగ్ యాప్‌లు, సంస్థల విశ్వసనీయతను సెబీ వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవాలని, తెలియని లింకుల నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేయొద్దని, మోసపోతే వెంటనే http://www.cybercrime.gov.in లో లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# మదీనాగుడా లో కొత్త బ్లడ్ సెంటర్ ప్రారంభం



శేరిలింగంపల్లి: (బిఎన్ఎస్): మదీనాగుడాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య మదీనాగుడా బ్లడ్ సెంటర్‌ను పీఏసీ చైర్మన్ ఆరెకెపూడి గాంధీ బుధవారం ప్రారంభించారు. తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బ్లడ్ సెంటర్ స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, తలసేమియా చిన్నారులు, ప్రసవ సమయంలో, ప్రమాదాల్లో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రక్తదానం చేసే వారు ఆరోగ్యంగా ఉంటారని, భయపడకుండా యువత ముందుకు రావాలని కోరారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ ప్రెసిడెంట్ వెంకట ప్రసాద్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గురు చరణ్ దూబె తదితరులు పాల్గొన్నారు.

# రేపు కొమ్మిపాడు గ్రామంలో పల్లె వీక్షణ

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు జిల్లా కలెక్టరేట్ (బి.యన్.యస్): -ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వినూత్నంగా చేపట్టిన "పల్లె వీక్షణ" కార్యక్రమం ఈనెల 29న (శుక్రవారం) సైదాపురం మండలం కొమ్మిపాడు గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కొమ్మిపాడు గ్రామపంచాయతీ పరిధిలో జలధార--జలహారతి కార్యక్రమంలో భాగంగా అటవీ ప్రాంతం నుంచి రమణయ్య గార్డెన్ వరకు చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులను కలెక్టర్ పరిశీలించనున్నారు. అలాగే పీఆర్ సీసీ రోడ్డు పనులు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించనున్నారు. గ్రామంలో చెత్త సేకరణ, తడి--పొడి వ్యర్థాల వేరు చేసే విధానంపై ఇంటింటికి వెళ్లి ప్రజలతో కలెక్టర్ మాట్లాడనున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అందుతున్న సేవలను సమీక్షించనున్నారు. రైతు సేవా కేంద్రంలో ఛాంపియన్ రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించనున్నారు. రైతులకు పీఎండీఎస్ కిట్ల పంపిణీతో పాటు సహజ వ్యవసాయ వనరుల ప్రదర్శనను పరిశీలించనున్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనుండగా, పశుసంవర్ధక రంగంలో ముందున్న రైతులతో కూడా కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడనున్నారు.

ఈ పర్యటనలో భాగంగా గ్రామ ప్రజలతో కలెక్టర్ నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

# శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

## మహబూబ్‌నగర్ నాట్య బృందం ఆహూతులను అలరించింది



మాదాపూర్: (బిఎన్ఎస్): మాదాపూర్‌లోని శిల్పారామంలో బుధవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరించింది. మహబూబ్‌నగర్ నుంచి విచ్చేసిన నాట్య గురువు శాంతి గారి శిష్య బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. కళాకారులు గణేశా కౌతం, సూర్యాష్టకం, తాండవమాడెను శివుడు, అన్నయ్య సంకీర్తనలు, గణేశా పంచరత్న, తారంగం, గోవిందా నామాలు, జయ జయ దుర్గే, దేవా దేవాంభజే, మంగళం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. భవిష్య, మహాసేన, నిత్య, వైష్ణవి, లక్ష్య, లాస్యశ్రీ, తన్విక, శ్రీమాన్య, లలిత, మహతి, యశ్వి తదితరులు తమ అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. శాస్త్రీయ నృత్యంలోని హావభావాలు, పాదభేదాలు, తారంగం విన్యాసాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమానికి స్థానికులతో పాటు పర్యాటకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


# అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాంపై కేంద్రమంత్రితో చర్చించిన సీఎం రేవంత్



హైదరాబాద్: అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై కేంద్రమంత్రితో సీఎం ప్రస్తావించారు. దీనిపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

# ఎన్టీఆర్ ప్రపంచ దేశాలకు ఆదర్శం

## శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



హైదరాబాద్, బిఎన్ఎస్ : దివంగత తెలుగు దేశం నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) ప్రపంచ దేశాలకే ఆదర్శవంతుడని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, "ఎన్టీఆర్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన మహానాయకుడు. నటుడిగా ప్రజల మనసుల్లో చోటు సంపాదించిన ఆయన, రాజకీయాల్లోకి అడుగుపెట్టి కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి చరిత్ర సృష్టించారు" అని పేర్కొన్నారు.ఎన్టీఆర్ పాలనలో ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలను గుర్తు చేస్తూ ఆయన మరింత వివరించారు. "రూపాయికి కిలో బియ్యం పథకం ద్వారా పేదలకు అన్నం అందించడంలో ఆయన చేసిన కృషి అనన్యం. మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వానికి బాటలు వేశారు. గురుకుల పాఠశాలల స్థాపన ద్వారా పేద, గ్రామీణ విద్యార్థులు మంచి విద్యను అందుకోవడానికి మార్గం సుగమం చేశారు" అని అన్నారు.నటుడిగా, రాజకీయ నాయకుడిగా ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆదర్శాలు ఇప్పటికీ తెలుగు జాతికి మార్గదర్శకమని అరికెపూడి గాంధీ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీడియా మిత్రులకు క్రికెట్ టోర్నీ

## - జట్ల వివరాలు మే 29లోగా అందజేయాలి

## - సైబరాబాద్ సీపీ కార్యాలయం ప్రకటన

సైబరాబాద్:(బిఎన్ఎస్): హైదరాబాద్ మహానగరంలో వివిధ కమిషనరేట్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు పరస్పర స్నేహభావం, ఐక్యతను బలోపేతం చేసేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో సీపీ కార్యాలయం పేర్కొంది.ఈ టోర్నీలో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు తమ తమ జట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. జట్టు పేరు, క్రీడాకారుల జాబితా, ఇతర వివరాలను సిద్ధం చేసి రెండు రోజుల్లోగా, అంటే మే 29వ తేదీలోగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ సంజీవ్‌ను 8712663033 నంబర్‌లో సంప్రదించాలని కోరింది.మీడియా మిత్రుల సహకారం,భాగస్వామ్యంతో ఈ క్రీడా వేడుకను విజయవంతం చేయగలమని సైబరాబాద్ కమిషనరేట్ క్రీడా విభాగం ఆశాభావం వ్యక్తం చేసినట్లు ప్రకటనలో తెలిపింది.

# మానసిక ఒత్తిడిని నియంత్రించడమే లక్ష్యం..!!



కడపజిల్లా (బిఎన్ఎస్) మే27: కడప ఎస్పీ నచ్చికేత్ ఆదేశాల మేరకు, మైదుకూరులోని డీఎస్పీ ఆఫీసు మైదానంలో మైదుకూరు పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి యోగా, మెడిటేషన్ శిక్షణ శిబిరం నిర్వహించబడినది. ఈ శిక్షణ కార్యక్రమంలో మూడు రోజుల పాటు హార్ట్ ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్ నిపుణుల ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ ప్రత్యేక శిక్షణగా నిర్వహించబడుతోంది.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు,అలాగే రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, విధి నిర్వహణలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎదుర్కొనే మానసిక ఒత్తిడులు,సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని పోలీస్ ఉన్నతాధికారులు చేపడుతున్నారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో ఒత్తిడిని నియంత్రించే విధానాలు, మానసిక ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే పద్ధతులు, కోప నియంత్రణ పద్ధతులు,సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధానం, విధులను మరింత సమర్థంగా నిర్వర్తించే మార్గదర్శకాలు అందిస్తారు. ఈకార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, పోలీసు అధికారులు మరియు ట్రైనర్ సురేంద్రనాథ్ రెడ్డిపాల్గొన్నారు.

# మహిళ సమాఖ్యల ద్వారా బాలికలకు సైకిళ్లు పంపిణీ



నల్లగొండ జిల్లా : గ్రామీణ ప్రాంత బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయాడమే మహిళాశక్తి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు...

బాలికలకు క్రీడల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, సైక్లింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి, మక్కువ ఉన్న విద్యార్థినులను ప్రోత్సహించేందుకు సైకిళ్లను అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మహిళా సాధికారత కోసం తిరుమలగిరి మండల సమాఖ్య ఆధ్వర్యంలో 'మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని తిరుమలగిరి మహిళ సమాక్య ఆధ్వర్యంలో స్నేహ సంఘాల బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. . సైక్లింగ్ అనేది శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడుతుందని ఆయన అన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# తెదేపా ఆధ్వర్యంలో మహానాడు



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్);–తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక వేడుక మహానాడు నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు.స్థానిక శ్రీ వెంకటేశ్వర మహల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్లస్టర్ శ్రీ ఇన్‌చార్జ్ చెన్ను పెంచల్ రెడ్డి,మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్చువల్ మహానాడు సభ,రాపూరు మండల రాజకీయాల్లో కొత్త జోష్ నింపింది...

ఈ సభలో భారీ ఎల్ఈడీ తెరపై పార్టీ అధినేత చేసిన వర్చువల్ ప్రసంగాన్ని కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు.పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, ప్రజలకు చేరువయ్యే విధానాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల ప్రాధాన్యతను అధినేత వివరించిన తీరు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. పార్టీ విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై అధినేత ఇచ్చిన దిశానిర్దేశం అందరిలో నూతన ఉత్తేజాన్ని నింపింది.

ఈ సందర్భంగా క్లస్టర్ శ్రీ ఇన్‌చార్జ్ చెన్ను పెంచల్ రెడ్డి మాట్లాడుతూ,తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు ప్రజల సంక్షేమమే పరమావధిగా పని చేస్తోంది.నేడు రాష్ట్రంలోని పరిస్థితులపై ప్రజలందరూ టీడీపీ వైపు ఆశగా చూస్తున్నారు.రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది. ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేసి,పార్టీ విజయానికి కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.

?మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి మాట్లాడుతూ,పార్టీ అధినేత పిలుపు మేరకు రాపూరులో పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం,వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండటమే మా ప్రధాన లక్ష్యం.ఈ వర్చువల్ మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలను, భవిష్యత్తు లక్ష్యాలను ప్రతి కార్యకర్తకు చేరవేశాం.కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుంది అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు మండల టిడిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనింగ్ గనుల్లో పనిచేసే కార్మికులకు పని భద్రతను కల్పించాలి

## -సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి శ్రీనివాసులు



నెల్లూరు జిల్లా సైదాపురం(బి.యన్.యస్):–నెల్లూరు జిల్లా సైదాపురం మండలం చుట్టుపక్కల పరిసర ప్రాంతాల నందు అనేక గ్రామాలలో ప్రజలు మైనింగ్ గనుల్లో వందలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు పని భద్రత, కనీస సౌకర్యాలను కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పంచేటి, శ్రీనివాసులు వసంత కృష్ణ మైకా, మరియు కృష్ణ మైనింగ్ కంపెనీ నందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల దగ్గరికి వెళ్లి మాట్లాడడం జరిగింది వీటితోపాటుగా చుట్టుపక్కల సైదాపురం మండల పరిధిలో 300 మైనింగ్ కంపెనీలు ఉన్నాయి ఈ మైనింగ్ కంపెనీలో స్థానికులే కాకుండా మధ్యప్రదేశ్ ఒరిస్సా బీహార్ రాష్ట్రాల నుండి కూడా హిందీ కార్మికులు అనేకమంది పనిచేస్తున్నారు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు పనిచేస్తున్న కార్మికులకు కేవలం 400 రూపాయలు మాత్రమే ఇవ్వడం దారుణమని అలాగే ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తున్న కార్మికులు కేవలం 12 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు పనికి తగ్గ వేతనం పూర్తిగా అమలు కావడం లేదు అని తెలియజేశారు మైనింగ్ కంపెనీలో కనీస నిబంధనలను కూడా పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మైనింగ్ క్వారీలపై ఎలాంటి చర్యలు లేవు రాజకీయ నాయకులు అండదండలతో గత కొన్ని సంవత్సరాల కిందట లీజుకు తీసుకున్న అనేక మైనింగ్ కంపెనీలు ఇప్పటికీ కూడా పర్మిషన్ అయిపోయినప్పటికీ ఇంకా కూడా నడుస్తున్న మైనింగ్ కంపెనీలపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు మరోవైపు సిద్ధలయ్య కోన పరిసర ప్రాంతాలలో ఫారెస్ట్ భూముల్లో ఇష్టానుసారంగా తొవ్వుకొని వెళ్తున్నారు ఎప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి పర్మిషన్ లేని మైనింగ్లను సీజ్ చేయాలని కార్మికులకు పని భద్రత కల్పించాలని తెలియజేశారు

# మియాపూర్ ZPHS భవనం ఎప్పుడే..?

## అక్రమ స్కూళ్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

## డీఈవో సుసేందర్‌రావుకు AIFDS వినతి

మియాపూర్( బిఎన్ఎస్): మియాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) నూతన భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, శేర్లింగంపల్లి మండలంలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరుతూ AIFDS గ్రేటర్ హైదరాబాద్ కమిటీ రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సుసేందర్‌రావుకు వినతిపత్రం సమర్పించింది. సమస్యలపై డీఈవో సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా AIFDS రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి మాట్లాడుతూ.. 2023లో రూ.1.51 కోట్లతో మియాపూర్ ZPHS భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పాత భవనాన్ని కూల్చివేసినా, కొత్త భవన పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం 1000 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో 24 గదులకు బదులుగా కేవలం 9 గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా శేర్లింగంపల్లి, మాదాపూర్ ప్రాంతాల్లో సుమారు 20 ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్నాయని ఆరోపించారు. 'నేషనల్', 'గ్లోబల్', 'టెక్నో' వంటి పేర్లతో భారీ ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. స్థానిక వీజూా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టి అక్రమ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఈ కార్యక్రమంలో AIFDS గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి ఎస్. ఈశ్వర్, కమిటీ సభ్యులు జేడీ గణేష్, దుర్గాప్రసాద్, జాస్మిన్ రాజ్, వివేక్ హర్షా, శ్రీరామ్, వేదవర్షిత్, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన




నల్లగొండ (బిఎన్ఎస్): బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు, బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు..

ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నల్గొండ పట్టణంలోని రెడ్ క్రాస్ భవనంలో మహిళ,శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహల రహిత తెలంగాణ లక్ష్యంతో "బాల్య వివాహ నిషేధ చట్టం––2006"పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలనీ, తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని కోరారు.... విద్యార్థులు సోషల్ మీడియాను అతి మోతాదులో ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని, ఏఐ ఫోటో మార్ఫింగ్ వంటి సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమని, సమాజంలో తలెత్తుకుని జీవించేలా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు.

# రాపూరులో క్లస్టర్ ఫోర్ ప్రారంభమైన మహానాడు

నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):–తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు వేడుకలు నెల్లూరు జిల్లా రాపూరు క్లస్టర్ ఫోర్ పరిధిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. క్లస్టర్ ఫోర్ ఇంచార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక షాది మంజిల్ వేదికగా జరిగిన ఈ మహానాడు కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత తెలుగుదేశం పార్టీ పార్టీ వ్యవస్థాపకులు,స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని డిజిటల్ స్క్రీన్ ద్వారా టిడిపి శ్రేణులు వీక్షించారు.



అనంతరం క్లస్టర్ ఫోర్ ఇంచార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు,సొసైటీ అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఏదోటి కోటి నాయుడు, మీడియాతో మాట్లాడుతూ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు, పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నాయకత్వంలో ఈ మహానాడు ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న ఎన్టీఆర్ సిద్ధాంతమే తమ పార్టీకి దిక్సూచి అని తెలుపుతూ, ఈ ఏడాది మహానాడులో స్త్రీ శక్తి నినాదానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చినట్లు, సాంకేతికతను అందిపుచ్చుకుంటూ,డిజిటల్ విధానంలో వర్చువల్ వేదికగా మహానాడును నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాపూరు మండల టిడిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.